గజేంద్ర మోక్షం

వసుంధర

విశాఖపట్నం బీచ్—

ఇసుక తిన్నెపై శాస్త్రి శర్మ....

ఇద్దరూ గంభీరంగా వున్నారు.

వారి మౌనం చూస్తూంటే సముద్రుడి కబుర్లు వింటున్నారా అనిపిస్తుంది.

"శర్మా!" అన్నాడు శాస్త్రి ఏదో చెప్పబోతున్నవాడిలా.

అతడేం చెబుతాడోనని కాబోలు సముద్రుడూ తన ఘోష ఆపాడు.

"ఊఁ చెప్పు—" అన్నాడు శర్మ.

"కడుపులో ఆకలి. జేబులో డబ్బుల్లేవు...."

"పాత విషయంకాదు. కొత్తదేమైనా చెప్పు...."

"మనలో తెలివి వుంది. సామర్థ్యముంది. ఎందుకిలా కొరగానివాళ్ళమైపోయాం?" అన్నాడు శాస్త్రి.

"మనమేమీ కొరగానివాళ్ళం కాదు, ఎన్నో

సాధించాం. కానీ...."

"ఊఁ కానీ...."

"డబ్బు మిగుల్చుకోలేక పోతున్నాం—...."

"ఎందుకంటావ్?"

"ఎందుకో నాకూ తెలియదు...." అని నిట్టూర్చాడు శర్మ.

"అయిడియా...." అన్నాడు శాస్త్రి.

"కడుపు నింపేదేనా?" అన్నాడు శర్మ అనాసక్తతతో.

"ఇప్పుడు కాకపోయినా ముందు ముందు నింపవచ్చు."

శర్మ నిట్టూర్చి—"ముందిప్పటికి పనికొచ్చే అయిడియా చెప్పు—" అన్నాడు.

"అది నాకూ తెలియదు. కానీ మనమిలా యెందుకున్నామో నా కర్థమయింది—"

"పోనీ అదే చెప్పు..."

"మనకు ధనమంటే తెలియదు. అయినవాళ్ళెవ్వరూ లేరు. కండబలముంది. బుద్ధిబలముంది. స్వార్థం గురించి ఆలోచనలేదు—...."

"మన్ని మనం పొగుడుకుంటే కడుపునిండదు...."

"నేను చెప్పేది పూర్తిగా విను. ఈ దేశంనిండా స్వార్థపరులు. వాళ్ళు దేశం ప్రగతిపథానికి వెళ్ళకుండా ఆపుతున్నారు. అలాంటివారి నెదిరించడమే మన ముఖ్య లక్ష్యంగా పెట్టుకుంటే—ఎంతో బాగుంటుంది. లక్ష్యం లేకపోవడంవల్లనే మనమిలాగుండిపోయామని నాకనిపిస్తోంది—"

"నువ్వు చెప్పింది నిజమే! కానీ ముందు కడుపు నిండాలి కదా—అప్పుడే లక్ష్యం గురించి ఆలోచించే

ఓపిక వస్తుంది—" అన్నాడు శర్మ.

"లక్ష్యం గురించి ఆలోచించగానే కడుపునిండే ఉపాయమూ తోచింది—శే—"

"ఎక్కడికి?"

"సుబ్రహ్మణ్యేశ్వరరావింటికి!"

"ఆయ నెవడు?"

"ఈరోజాయన కూతురు పెళ్ళి...."

"అయితే...."

"అక్కడ ఘనమైన విందు."

శర్మ టక్కున లేచి నిలబడి మళ్ళీ నీరసంగా కూర్చుండి పోయాడు— "ఆ విందులో మనకు స్థానమెక్కడ దొరుకుతుంది?"

"ఆహ్వానపత్రంతో...."

"అదెలాగొస్తుంది...."

"లక్ష్యముండాలిగానీ ఉపాయం తట్టదా?"

"నాకు తట్టడంలేదు...."

"ఇంటికి పద— చెబుతాను...."

"శాస్త్రీ! ఇంటికి వెడితే నా ఆకలి పెరుగుతుంది."

"ఎందుకని?"

"ఒక్కటే ఒక్క గది—ఆ గదిలో ఒక్కగానొక్క బల్ల దానిమీద క్యారియర్ — పింగాణీ ప్లేటు— చూస్తూంటే నే నాకలి ఆగలేను...."

"మరీ అలా దిగులుపడిపోకు — మనం నిన్నకూడా భోంచేశాం తెలుసా?" అన్నాడు శాస్త్రి.

"ఆ మాటకొస్తే మొన్నకూడా భోంచేశాం...."

"అదే నేనూ చెబుతున్నాను. ఒకసారి నువ్వు వరుసగా మూడు రోజులు భోం చేయలేదు. గుర్తుందా?"

"బాగుంది. అప్పుడు వాడు జ్వర మొచ్చింది—"

"ఇప్పుడూ జ్వర మొచ్చిందనుకో—" అన్నాడు శాస్త్రి.

శర్మ అభ్యంతరం చెప్పలేదు. ఇద్దరూ లేచారు.

2

తలుపు తాళం తీశాక — "శర్మా! నువ్వు బయటే నిలబడు—" అన్నాడు శాస్త్రి.

"ఎందుకు?"

"చిన్న పని వుంది—" అన్నాడు శాస్త్రి.

శర్మ బయటే నిలబడ్డాడు.

శాస్త్రి లోపలకు వెళ్ళి తలుపులు వేసుకొని—రెండు నిమిషాల్లో తలుపుతీశాడు.

"ఏం చేశావ్?"

"తర్వాత చెబుతాను—ముందు లోపలకు పద...."

శర్మ బల్లవంకే చూశాడు—"ఆకలి!" అన్నాడు.

"నీ కాకలి గుర్తు రాకూడదు—" అన్నాడు శాస్త్రి.

"ఎందుకని?"

"బల్లమీద క్యారియరు—ప్లేట్లు నీకు కనపడకుండా దాచేశాను—"

"ఏమో—నాకవి కనపడుతూనే వున్నాయి...."

శాస్త్రికి అనుమానం వచ్చి బల్లంతా తడిమిచూశాడు. న్యూస్ పేపరుతప్ప దానిమీదింకేమీ లేదు.

"పాపం-నీకు చాలా ఆకలిగా వుంది...." అన్నాడు శాస్త్రి.

"జాలిపడొద్దు. దాంతో నా ఆకలితీరదు...."

"ఇంటాయన విశ్వంగారి దగ్గర ఆహ్వాన పత్రిక

వుంది" అన్నాడు శాస్త్రి.

"ఉంటే మనకేమి లాభం—ఆయన నీ వెంటరాడు!"

"ఆయన వెళ్ళడు ...."

"నీకెలా తెలుసు?"

"ఊళ్ళో ఏం జరిగినా ఆయనను పిలుస్తుంది. కానీ ఆయ నెక్కడికీ వెళ్ళడు—...." అన్నాడు శాస్త్రి.

"నువ్వు చెప్పింది నిజమే ... కాని ఆ ఆహ్వానపత్రం మనక్కావాలంటే యిస్తాడా?"

"అడిగేలా అడిగితే ఇస్తాడు ...."

"అయితే అడిగి పట్రా—...."

"నాతో నువ్వూ రావాలి ...."

"నేను రాను ...." అన్నాడు శర్మ.

"రానంటే ఎలా? ఇది మనిద్దరి అవసరమూను ...."

"ఆయనకు మనం రెండునెలల అద్దె బాకీ ఉన్నాం. వెళ్ళామంటే ఆయన అదే పనిగా తిట్లు లంకించు కుంటాడు.... ఆకలిగా ఉన్నప్పుడు అన్నం తినగలను. తిట్లు తినలేను ...."

"ఆయన మనని తిట్టడు ...."

ఉన్నట్టుండి శర్మకు గుర్తొచ్చింది— "అన్నట్లు మన మాయన్ను తప్పించుకుని తిరుగుతున్నాం కదూ—కావాల నెలా ఎదురుపడతాం?"

"శర్మా! నువ్వు మన లక్ష్యం సంగతి మర్చిపోతు న్నావు ...."

"గుర్తుంది-సుబ్రహ్మణ్యేశ్వరరావిల్లు ....

"అది కాదు—అన్యాయాల నెదిరించడం ...." అని—

"ఇంటాయన కూడా అన్యాయాలు, అక్రమా లు

చేస్తున్నాడని నా కనుమానంగా ఉంది—" అన్నాడు శాస్త్రి.

"పాపం—ఆయన సామాన్యుడు. ఉద్యోగం డబ్బుల మీదా, మనమిచ్చే అద్దె డబ్బులమీద ఆధారపడి బ్రతుకుతున్న అమాయకు డాయన..."

"ఆయన సామాన్యుడేనని నువొప్పుకున్నావు కదా! అలాంటప్పు డూళ్ళో జరిగే పద్ద పెద్ద పార్టీ లన్నింటికీ ఆయన కాహ్వాన మెలా వస్తోందంటావు?"

శర్మ తెల్లబోయి—"నిజమే!" అన్నాడు.

"ఇందులో యేదో గూడుపుఠాణీ వుంది—పద, వెళ్ళి ఆయన్ను బెదిరించి వద్దాం—" అన్నాడు శాస్త్రి.

"ఆయన కద్దె బాకీ వుండి ఆయన్నేం బెదిరిస్తాం—"

"ఆయన సామాన్యుడే కాదు. అమాయకుడని నువ్వే గదా అన్నావు—...."

"ఏమో—అమాయకుడని గ్యారంటీ యేమిటి? నే నేదో మాటవరసకన్నాను...."

"అసలు మన కిల్లద్దెకివ్వడమే ఓ అమాయకత్వం. ఆ పైన మనల్నింకా ఇల్లొంచి గెంటేయలేదంటే అదింకా అమాయకత్వం...."

"సరే—పద!" అన్నాడు శర్మ.

3

విశ్వం కుర్చీలో కూర్చున్నాడు. ఆయన కెదురుగా శివనాథ్ అనే సమవయస్కుడు కూర్చుని ఉన్నాడు.

"ఏమీ అనుకోకోయ్—ఈ వేళ్టి కెక్కడికీ రాలేను" అన్నాడు విశ్వం.

"నువ్వు రాకపోతే ఆటలో మజా వుండదు—"

అన్నాడు శివనాథ్.

"నిజమే — కానీ సుబ్రహ్మణ్యేశ్వరరావుగారింటికి డిన్నరుకి వెళ్ళకుండా యింట్లో బ్రిడ్జి ఆడ్డానికొస్తే యేం బాగుంటుంది?"

"కానీ నువ్వు డిన్నరుకి వెళ్ళడం లేదుగదా!"

"లేదనుకో.... నా కిలాంటి పార్టీ లిష్టముండవు. అందుకని వెళ్ళను. ఏ అనారోగ్యమో అని వంక పెడతాను. అలా వంక పెట్టాక యింట్లోనే వుండిపోవాలి. తర్వాత ఆయనకు తెలిస్తే బాగుండదు, అబద్ధమాడినా అతికినట్టుండాలి...."

"పోనీ మీ యింట్లోనే ఆట పెడితే...."

"మా ఆవిడ సంగతి నీకు తెలుసుగా....ఏదో బయటకు వెళ్ళి ఆడడాని కొప్పుకుంటోందని సంతోషించాలంతే...."

శివనాథ్ నిరుత్సాహంగా లేచి—"సుబ్రహ్మణ్యేశ్వరరావు కూతురు పెళ్ళి కాదుగానీ మన ఆట కొచ్చింది. నాలుగో చెయ్యి దొరుకుతుందన్న గ్యారంటీ లేదు. దొరికినా నీ లాంటి చెయ్యి దొరకదు....—" అన్నాడు.

అప్పుడు గుమ్మం దగ్గర శాస్త్రి, శర్మ వున్నారు.

"సుబ్రమణ్యేశ్వరరావు దాకా ఎందుకు? ఈ శివనాథ్ లేకపోతే వాళ్ళింట్లోనే ఫోంచేయ్యొచ్చు. బ్రిడ్జి కోసం యేమయినా యిష్టాడీయన?" అన్నాడు శర్మ, శాస్త్రి చెవిలో.

"సరే—మనకు బ్రిడ్జి రాదుగా—...." అన్నాడు శాస్త్రి.

"దానికేముంది— నేర్చుకుందాం!"

"నేర్పుతుందాంలే—ముందీ రోజు సమస్య తీరా లిగా—....."

శివనాథ్ గుమ్మందాకా వచ్చి వీళ్ళనోసారి పలకరించి వెళ్ళిపోయాడు.

విశ్వం శాస్త్రినీ, శర్మనూ అభిమానంగా లోపలకు పిలిచాడు.

శర్మ తెల్లబోయాడు.

"ఏమిటి—కాఫీ తీసుకుంటారా....?" అన్నాడు విశ్వం.

"అబ్బే—అలవాటు లేదండి—...." అన్నాడు శర్మ.

కాఫీ, టీలు అలవాటు లేదన్నవాళ్ళకి—సాధారణంగా ఘనపదార్థం ప్లేట్లలో వడుతుంది. అదే శర్మ ఆశ....

"అరే—నిలబడే ఉన్నారే — కూర్చోండి—" అన్నాడు విశ్వం.

ఇద్దరూ కూర్చున్నారు.

"ఇప్పుడే వస్తాను. మీరు కూర్చోండి" అంటూ విశ్వం లోపలకు వెళ్ళాడు.

"పాపం—నిజంగానే మంచివాడు, అమాయకుడు. ఈయన్ను మోసం చేయాలనిపించడంలేదు—" అన్నాడు శర్మ.

"ఎంతో ఆలోచించి గానీ నిర్ణయం తీసుకోకూడదు. తీసుకున్న నిర్ణయానికి కనీసం ఓ గంటైనా కట్టుబడి ఉండాలి. అదీకాక మనమీయన్ను మోసం చేయబోవడం లేదు—" అన్నాడు శాస్త్రి గంభీరంగా.

ఓ అయిదునిముషాల తర్వాత విశ్వం లోపల్నుంచి

తింగొచ్చాడు. శర్మ ఆశించినట్లాయన చేతిలో ప్లేటేమీ లేవు.

"ఇది నాకు కాఫీ టైము. మీరేమో తాగనంటిరి. ఒక్కణ్ణీ కూర్చుని మీ ఎదురుగా తాగడమేం బాగుం టుందీ—అందుకని లోపలకుపోయి తాగేసి వచ్చాను" అని—"ఏమిటీ—మొత్తం బకాయంతా తీర్చేస్తారా?" అన్నాడు విశ్వం.

"మేము బకాయి తీర్చడానికి వచ్చామని మీరెలా అనుకున్నారు?" అన్నాడు శాస్త్రి తెల్లబోయి.

"బాగుందోయ్—ఎవరిబ్బందులు వాళ్ళవి. సమయానికి డబ్బు చేతికందక బాకీ తీర్చడంలేదు. బాకీ తీర్చడంలేదని ముఖం చెల్లక నాక్కనిపించడం మానేశారు. మీరు పనిగట్టుకుని నా ఎదుట పడ్డారంటే—అందుకు బాకీ తీర్చడం మినహా కారణమేముంటుంది? ఇంకా యిప్పట్లో యివ్వలేమని చెప్పడానికి వస్తారనుకోను గదా!" అన్నాడు విశ్వం.

'పాపం—ఈయన నిజంగా అమాయకుడు—' అను కున్నాడు శాస్త్రి పైకి మాత్రం—"ఓ ముఖ్యమైన పని మీదొచ్చామండీ. అది మీకు శుభవార్త కాదు—" అన్నాడు.

విశ్వం కంగారుపడి—"ఏమిటిది?" అన్నాడు.

"మేమిద్దరం ప్రభుత్వం తరఫున పనిచేసే ఇంటెలి జెన్సు శాఖవాళ్ళం. ఇంతకాలం అది మీ దగ్గర కూడా రహస్యంగానే ఉంచాం. మాకు జీతాలందే యేర్పాటు అతిరహస్యం చేయబడడం వల్ల డబ్బుకు తరచుగా ఇబ్బంది పడుతూంటాం. ఇంతకీ అసలు సంగతేమిటంటే మీ మీద మాకు చెడ్డ రిపోర్ట్సు వచ్చాయి. మీరు ప్రజావిద్రోహులతో

చేతులు కలుపుతున్నారని తెలిసింది—" అన్నాడు శాస్త్రి.

"అద్దె ఇవ్వలేక నన్నిలా బెదిరిస్తున్నారా?" అన్నాడు విశ్వం కోపంగా.

"ఇది బెదిరింపు కాదు—నిజం—...."

"ముందు నా అద్దె చెల్లించి గది ఖాళీ చేసి వెళ్ళండి—"

"అందుకేం అభ్యంతరం లేదు. కానీ నాలుగురోజుల తర్వాత మీరు జైల్లో వుంటే అందుకు నన్ను తప్పట్టకండి. మంచివారనిపించి హెచ్చరించాలనుకున్నాను. ఆ పైన మీ ఇష్టం—"

ముందు విశ్వం బెదరలేదు కానీ క్రమంగా ఆయనలో భయం చోటు చేసుకుంది—"మీకేమైనా ఋజువులున్నాయా?"

"ఉన్నాయి—" అంటూ ఆహ్వానపత్రాలను గురించి చెప్పాడు శాస్త్రి.

"అదా?" అన్నాడు విశ్వం ఆదోలా.

"అదే—మీకు పెద్ద పెద్ద పార్టీలకే పిలుపులు వస్తున్నాయి. అందుక్కారణ మేమిటి? నగర ప్రముఖుల్లో మీకు ప్రాముఖ్యత ఎలా లభించింది?"

"ఇంకెక్కువ ప్రశ్నలు వేయకు. నా కొచ్చే ఆహ్వాన పత్రాల రహస్యం మీకు చెప్పేస్తాను. ఇంకెవరికీ చెప్పకూడదు మరి—" అన్నాడు విశ్వం.

విశ్వం వారిచేత ఒట్టేయించుకుని అసలు రహస్యం చెప్పాడు.

ఆయన ఓ కంపెనీలో పని చేస్తున్నాడు. మేనేజరు

వాడాయన పర్సనల్ సెక్రటరీ. మేనేజర్ రూంలో చాలా పలుకుబడి కలవాడు. ఆయన కొచ్చే ఆహ్వాన పత్రాలన్నీ ఓసారి చదివి అవతల పారేస్తాడు. వాటిని విశ్వం సేకరించి—కవరు మార్చి—వాటిపై తన పేరు రాసుకుని—ఇంట్లో ప్రదర్శిస్తూ ఉంటాడు. అందువల్ల ఆయనకు మిత్రబృందంలో పలుకుబడి పెరుగుతోంది. పిలిచినా పార్టీలకు వెళ్ళడని కొందరూ, పిలిచేవాళ్ళందరూ పెద్ద పెద్దవాళ్ళేనని కొందరూ ఆయన్ను గురించి ఆశ్చర్యంగానూ గొప్పగానూ చెప్పుకుంటారు.

అంతా అర్థమైనా శాస్త్రికి నవ్వొచ్చింది. శర్మ మాత్రం గంభీరంగానే వున్నాడు. మనసులో మాత్రం—"ఆకలి తీరాక నవ్వుకోవాలి—" అనుకున్నాడు.

"మీతో చాలా కాలంగా పరిచయమున్నది. మీరు మంచివారేనని మా నమ్మకం. అయితే యే నమ్మకానికైనా ఋజువుండాలి కాబట్టి—ఆ బల్లమీద కార్డిలా గివ్వండి—" అన్నాడు శాస్త్రి.

"ఎందుకు?"

"దాన్ని పరిశీలించాలి. అందులో సీక్రెట్ కోడేమీ లేదని ఋజువు చేసుకోవాలి. ఆ కార్డు ద్వారా మీకు రహస్య సమాచారం అందించబడలేదని మా పరిశోధన చెబితే మేము మీపై మంచి రిపోర్ట్సు రాసి పంపుతాం—" అన్నాడు శాస్త్రి.

విశ్వం బల్లమీద కార్డుతీసి శాస్త్రికి అందించాడు.

శాస్త్రి కార్డును పరిశీలించాడు.

తెల్లని కాగ్లో చదివి.

సుబ్రహ్మణ్యేశ్వరరావు కూతురు పెళ్ళి సందర్భంగా విందుకు ఆహ్వానం.

పైకు లేమ్మదన్నరట.

అప్రయత్నంగా శాస్త్రి పైకు మానుకుని లేచి నిలబడ్డాడు.

"ఏమయింది?" అన్నాడు విశ్వం కంగారుగా.

"పైనుప్పుతోంది?"

"దేనికి?"

"ఎందుకి___" అనబోయి ఆగిపోయాడు శాస్త్రి— "మా కవితల వేరే అసైన్‌మెంటుంది. వెళ్ళాలి—...."

"ఆ కార్డును పరీక్షిస్తే నా గురించిన నిజమెలాగూ తెలుస్తుంది. అయితే ఓ చిన్న రిక్వెస్టు—" అన్నాడు విశ్వం.

"చెప్పండి—" అన్నాడు శాస్త్రి.

"నేనూ గూఢచారి పని చేయాలనుకుంటున్నాను. మీరు నన్ను అసిస్టెంట్‌గా తీసుకోగూడదూ?"

శాస్త్రి ఆశ్చర్యంగా—"ఎక్కటి ఉద్యోగముంది. మీ కెందుకండీ ఈ గూఢచారి ఉద్యోగం!...." అన్నాడు.

"నాకూ ఓ సారి మా బావమరిదిని అనుమానించాలని వుంది........మీరు నన్నుమానించి నట్లే!" అన్నాడు విశ్వం.

4

అది సుబ్రహ్మణ్యేశ్వరరావు మేడ.

మేడ చుట్టూ ఎత్తైన ప్రహారీగోడ.

ఆ గోడలో ఓ పెద్ద ఇనుప తలుపుల గేటు—

గేటు బార్లా తెరిచివుంది.

వచ్చేపోయే జనంతో అక్కడంతా కోలాహలంగా వుంది.

గేటు దాటితే పెద్ద ఆవరణ.

పూల తోటా వుంది—మైదానం లాంటి లానూ వుంది.

లాన్లో పెద్ద షామియానా.

శాస్త్రి, శర్మ షామియానా దగ్గరకు వచ్చారు.

అక్కడో యిద్దరు యువతులు వారిద్దరినీ ఆప్యాయంగా పలకరించి రెండు చేతులు జోడించి నమస్కరించారు.

శాస్త్రి శర్మ ప్రతినమస్కారాలు చేశారు.

ఇంతలో ఓ యువకుడు ఆ యువతుల వెనుక నుంచి ముందుకువచ్చి చేయి జాపాడు.

శాస్త్రి అతడి చేతిలో ఇన్విటేషన్ కార్డుంచాడు.

అతడాశ్చర్యపోయి-"షేక్ హాండిస్తా రనుకున్నాను" అన్నాడు.

శాస్త్రి దెబ్బతిన్నాడు.

అక్కడున్నవాళ్ళలో ఇంకెవరూ కార్డులు కూడా తెచ్చినట్లు లేదు.

శర్మ శాస్త్రిని కూడా పట్టించుకోకుండా ముందడుగు వేశాడు.

షామియానా కింద పొడుగ్గా వున్నాయి బల్లలు. బల్లలపై ఖరీదైన గుడ్డలు కప్పారు. గుడ్డపై బేసిన్లలో ఫలహారాలు. ఫలహారాల పక్కన ప్లేట్లు.

శర్మ ప్లేటందుకున్నాడు.

అతడికేం చేస్తున్నాడో తెలియడంలేదు.

ఆకలి....

శాస్త్రి ఇన్విటేషన్ కార్డు తీసుకున్నతడితో మాట్లాడుతున్నాడు. అతడు శాస్త్రిని వదలడంలేదు. తన గురించి

తెగ చెప్పుకుంటున్నాడు.

అతడు పెళ్ళికూతురు కజిన్ బ్రదరట. మర్యాదలు చేయడం అతడి బాధ్యత అట. తన పెళ్ళికి వచ్చి యెవరు సంతృప్తిపడకపోయినా పెళ్ళికూతురు అతడినే తప్పుపడుతుందిట.

శాస్త్రి కబుర్లు వింటున్నాడు. వింటూ శర్మను చూస్తున్నాడు.

అతడికి శర్మంటే అసూయగా వుంది.

ఇంకెవరో వచ్చారు. అమ్మాయిలు వాళ్ళకి నమస్కరించారు.

“వెళ్ళి షేక్‌హాండివ్వండి—” అన్నాడు శాస్త్రి.

అతడు వెళ్ళాడు. శాస్త్రి ప్లేటువైపు దూకేశాడు.

తర్వాత కాసేపతడికి ప్రపంచం తెలియదు.

ఆకలి.... ఆ బాధ అనుభవించినవాళ్ళకే తెలియాలి.

కాసేపటికే శాస్త్రికి ఆత్మారాముడు శాంతించాడు. శర్మను పలకరించాడు. శర్మ కూడా అప్పటికి తృప్తి చెందాడు. శాస్త్రిని కౌగలించుకొని—“యూ ఆర్ వండ్రఫుల్—” అన్నాడు.

శాస్త్రి మిత్రుడి చెవిలో—“ఇప్పుడేం చేద్దాం—” అన్నాడు.

“వెళ్ళిపోదాం—” అన్నాడు శర్మ.

అక్కడ యెవరూ యెవర్నీ పట్టించుకోవడంలేదు. వున్నవారందరూ భిన్న సంస్కృతుల్లో కనపడుతున్నారు. ఆ జనంలో ఇరుక్కోడం కష్టమే ననిపించి—వెళ్ళిపోవడమే మంచిదనుకున్నాడు శాస్త్రి.

ఇద్దరూ బయల్దేరారు.

అప్పుడో చేయి శాస్త్రి భుజంమీద పడింది.

ఉలిక్కిపడి వెనక్కి తిరిగాడు శాస్త్రి.

"ఇప్పుడే వెళ్ళిపోతారేం బ్రదర్స్—" అన్నాడాయన.

ఆయన వాళ్ళని బ్రదర్సని పిలిచినా చూడ్డానికి వాళ్ళ నాన్నలాగున్నాడు.

బట్టతల—నెరిసిన మీసాలు—సఫారీ సూట్—అంబాసిడర్ బూట్.

చామనచాయ రంగు—తమాషా నవ్వు....

శాస్త్రి కాయన తనకెందుకు కావాలో తెలియలేదు. ప్రశ్నార్థకంగా చూశాడు.

ఆయన నవ్వి—"రండి—అలా కూర్చుందాం—" అన్నాడు.

అంతవరకూ అక్కడున్న ఇతర యేర్పాట్లు చూడనే లేదు వాళ్ళు.

దూరంగా పేము బల్లలు, చెయిర్స్—సెట్లు సెట్లుగా అమర్చివున్నాయి. ఒకో బల్లదగ్గర నాలుగేసి కుర్చీలు. ఎందరో అక్కడ కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్నారు. కొందరు ప్లేట్లలో టిఫిన్ తింటున్నారు. కొందరికి విస్కీ వగైరాలు సర్వ్ చేస్తున్నారు కొందరు ఖరీదయిన సర్వర్లు.

"మాకు తాగే అలవాటు లేదు—" అన్నాడు శాస్త్రి.

"నాకు తాగే అలవాటుంది—" అన్నాడాయన.

రెండింటికీ సంబంధమేమిటో శాస్త్రి కర్థంకాక పోయినా—"ఏయ్ శర్మా!" అన్నాడు.

శాస్త్రి ఆగిపోవడం చప్పుడు విని తెలుసుకుని తనూ ఆగిపోయినా శర్మ ముందుకే గానీ వెనక్కి చూడడం

లేదు. పనసకాల ఫలహారాలున్నాయి. వాటిని ఆరగించడం అయింది. ముందు సుందరాంగులున్నారు. ఆవిడ చూపులు చురుగ్గా వున్నాయి.

శాస్త్రి పిలుపు విని అతడు వెనక్కి తిరిగాడు.

ముగ్గురూ ఓ టేబిలు దగ్గరకు వెళ్ళి కూర్చున్నారు.

"నాకు మీరిద్దరూ చాలా నచ్చారు—" అన్నాడాయన.

"ఎందుకని?" అన్నాడు శాస్త్రి.

"ఇక్కడికొచ్చిన వాళ్ళని చూస్తున్నాను. చక్కటి విందు ఇది. ఒక్కరు కూడా తిన్నగా తినటం లేదు. సుతారంగా కాస్త తిని లేస్తున్నారు. మీ ఇద్దరు మాత్రం పది రోజులుంచి తిండి లేనివాళ్ళలా—చక్కగా భోంచేసి విందుకే సార్థకత తెచ్చారు...."

ఆయన జోకేస్తున్నాడో, వెటకారం చేస్తున్నాడో మెచ్చుకుంటున్నాడో శాస్త్రికి తెలియలేదు కానీ తాము తిన్న పద్ధతి ఆయన్నాకర్షించిందని తెలిసి అతడికి సిగ్గేసింది. శర్మ మాత్రం చుట్టూ వున్న సిగ్గుల మొగ్గలను చూస్తున్నాడు—ఆ సంభాషణలో జోక్యం చేసుకోకుండా.

"మిమ్మల్ని చూస్తే నా కెంతో ఆనందంగా వుంది. నా నాలిక కెన్నో రుచులున్నాయి కానీ రోజు కొక్క పూట మాత్రమే నేను భోంచేయాలి. అదీ పరిమితంగా. జబ్బు చేసేదాకా సుష్టుగా భోంచేసేవాణ్ణి. మా యింట్లో నేను, మా నౌకర్లు మాత్రమే సుష్టుగా భోంచేస్తామని మా ఆవిడ వేళాకోళం ఆడుతూంటుంది. ఆవిడ తన ఫిగర్ పాడైపోతుందని తిండి తినదు. ఇద్దరమ్మాయిలు నాకు. ఇద్దరూ ఏడు మల్లెపూల ఎత్తు తూగుతారంతే.

ఇద్దర బ్బాయిలు—వాళ్ళకూ గుచీపచీ అక్కడ్లేను కాలో రీలు లెక్క చూసుకుని భోం చేస్తారు అంగు కే వాళ్ళంటే నాకు చిరాకు. ఎవరైనా తృప్తింగా భోంచేస్తుంటే చూడాలనుంటుంది. అలాంటివాళ్ళు నాకు పనివాళ్ళ లోనూ, బిచ్చగాళ్ళలోనూ కనబడతారు. వాళ్ళను నేను చూడలేను. మీకులా నీటుగా కనపడాలి....” అని— “నా కోసం మీ రింకో రౌండ్ వేస్తారా—చూడాలని వుంది...” అన్నాడాయన.

ఇదేమైనా ప్రాక్టికల్ జోక్ కాదుకదా అని శాస్త్రికి అనుమానం కలిగింది. చెప్పాలంటే యింకో రౌండ్ వేయగల శక్తి అతడికుంది. ఓ క్షణం ఆలో చించి—“ఆ మూలంగా టేబిలు దగ్గర కూర్చున్నారూ— వాళ్ళను పిలవండి—వాళ్ళు మీ కోరిక తీర్చగలరు—” అన్నాడతడు.

ఆయన అటు చూశాడు.

అక్కడో లావుపాటి అమ్మాయి—ఇద్దరు లావుపాటి అబ్బాయిలు కూర్చున్నారు. అందరి చేతుల్లోనూ ప్లేట్లు న్నాయి.

ఆయన కాసేపు వాళ్ళని గమనించి—“నీ సెన్సాఫ్ హ్యూమర్ మెచ్చుకుంటాను. కానీ వాళ్ళంటే నాకు నచ్చరు—” అన్నాడు.

“ఎందుకని?”

“వాళ్ళీ విందుకి ఆహ్వానించబడలేదని నా నమ్మకం. ఎవరిదో ఆహ్వానంమీద వచ్చారు. అందులో సందేహం లేదు —....”

“మీ కెలా తెలుసు?”

చెప్పబోయేముందు ఆయన గలగలా నవ్వాడు. ఆ

నవ్వు విచిత్రంగానూ, భయంకరంగానూ ఉంది. దూరంగా టేబిలు దగ్గరున్న లావుపాటివాళ్ళు కూడా ఓసారి తిండి తినడం ఆపి అటు చూశారు.

శాస్త్రి ఆయనవంక ఆశ్చర్యంగా చూశాడు.

ఆయన అతికష్టమీద నవ్వాపుకుని—"షామియానాలో అడుగెట్టే ముందు వాళ్ళు కార్డు చూపించారు—...." అన్నాడు. మళ్ళీ ఆయనకు నవ్వొచ్చింది,

"చూపిస్తే యేం?"

"ఆహ్వానపత్రం అడ్మిట్ కార్డు కాదు—అది కూడా తీసుకురావలసిన అవసరం లేదు.... నేనైతే నాకొచ్చిన ఇన్విటేషన్ కార్డ్సన్నీ నా సెక్రటరీ కిస్తూంటాను...." అన్నాడాయన.

"మరి సెక్రటరీ ఆ కార్డు తీసుకుని పార్టీకొస్తే...."

"సుబ్రహ్మణ్యేశ్వరరావు లాంటి వాళ్ళు విందిచ్చారంటే—ఓ వెయ్యిమంది ఎక్కువొచ్చినా బాధలేదు. అయినా రిసెప్షన్ దగ్గర ఇన్విటేషన్ కార్డుని అడ్మిట్ కార్డులా యిచ్చేవాళ్ళను చూడగానే తెలిసిపోతుంది—వాళ్ళా ఆహ్వానం ఎక్కణ్ణించో కొట్టుకొచ్చారని...." అన్నాడాయన.

తమను గురించి తెలిసే ఆయన ఆ మాట లంటున్నారని శాస్త్రికి అనుమానం వచ్చింది. ఎందుకైనా మంచిదని అతడు — "మీరు గజేంద్రరావుగారు కదూ....!" అన్నాడు.

ఆయన తెల్లబోయి—"మీ కెలా తెలుసు....?" అన్నాడు.

"మా కన్నీ తెలుస్తాయి. అందరూ తెలుస్తారు—...."

"నువ్వు స్తమానూ మాట మాట అంటున్నావు. నీ పక్కన కూర్చున్నతడు — బెల్ల కొట్టిన రాయిలా యేమీ మాట్లాడ దేం!" అన్నాడు గజేంద్రరావు.

శాస్త్రి స్వరం తగ్గించి గజేంద్రరావు వైపు వంగి— "అతను అతిథులందర్నీ శ్రద్ధగా గమనిస్తున్నాడు—" అన్నాడు.

"ఎందుకు?"

"కాసేపట్లో యిక్కడో పెద్ద నేరం జరగ బోతోంది—...."

గజేంద్రరా వాశ్చర్యంగా—"ఎవరు చెప్పారు?" అన్నాడు.

"ఎవరూ చెప్పకుండానే మాకన్నీ తెలుస్తాయి. జరగబోతున్న నేరా న్నాపడానికే మే మిక్కడకు వచ్చాం—" అన్నాడు శాస్త్రి.

"అలాగా" అన్నాడు గజేంద్రరావు.

సెక్రటరీకి కార్డు లిస్తూనే ఆయన విశ్వం ఫాన్ అయుంటాడని ఊహించాడు శాస్త్రి గజేంద్రరావును చూడకపోయినా ఆయన గురించి చాలా విన్నాడతడు విశ్వం ద్వారా.

శాస్త్రి కిప్పుడు సంతోషంగా వుంది. గజేంద్రరావు కిప్పుడు తామంటే శాస్త సదభిప్రాయం కలిగినట్లే ఉంది.

గజేంద్రరావు కాసేపు మాట్లాడలేదు. తర్వాత నెమ్మదిగా — "జరగబోతున్న నేర మేమిటో మీకు తెలుసా?" అన్నాడు.

"తెలిసింది కూడా తెలుసని చెప్పం మేము...."

గజేంద్రరావు చేయి జాపి శాస్త్రికి షేక్ హాండి

చ్చాడు—"మిమ్మల్ని కలుసుకున్నందుకు నాకు చాలా సంతోషంగా ఉంది—"

"మా రాకకు సంతోషించేవారు ఒకరైనా యిక్కడున్నందుకు నాకెంతో సంతోషంగా ఉంది—" అన్నాడు శాస్త్రి ఆయనతో కరచాలనం చేస్తూ.

"మీ రిద్దరూ యిక్కడే కూర్చోండి—నే నిప్పుడే వస్తాను—" అని గజేంద్రరావు అక్కణ్ణించి లేచాడు.

ఆయన వెళ్ళగానే శాస్త్రి శర్మ భుజం తట్టి—"గజేంద్రరావుగారు వెళ్ళిపోయిన విధానం చూస్తూంటే ఆయనే యిక్కడేదో నేరం చేయడానికి వచ్చినట్లుంది" అన్నాడు.

శర్మ శాస్త్రివైపుకి తిరిగి—"పోనీ లెద్దూ—ఆయన కారుమీద యిక్కడకు వచ్చాము. విందు సుబ్రహ్మణ్యేశ్వరరావుదే అయినా, కారు విశ్వమిచ్చినా, మనం గజేంద్రరావు ఉప్పు తిన్నట్లే లెక్క. ఆయనకేమీ హాని తల పెట్టకద్దు—" అన్నాడు శర్మ.

"అయితే మా సంభాషణంతా విన్నావా?"

"అన్నీ విన్నాను. కానీ దానిగురించి లోతుగా ఆలోచించలేదు. రేపటి ఆకలి గురించే నా ఆలోచనంతా!" అన్నాడు శర్మ.

5

గజేంద్రరావు శాస్త్రి శర్మలను వదిలిపెట్టి దూరంగా కనపడుతున్న ఓ మనిషి దగ్గరకు వెళ్ళాడు

అతడు నల్లటి నలుపు. బట్టలు తెల్లటి తెలుపు.

గజేంద్రరావును చూసి అతడు నవ్వాడు. అప్పుడు పళ్ళు తెల్లగా మెరిశాయి.

"పాల్సన్—నీతో మాట్లాడాలి!" అన్నాడు గజేంద్ర

రావు.

ఇద్దరూ కాస్త దూరంగా వెళ్లారు.

"శరత్ రావడానికింకా ఎంత టైముంది?" అన్నాడు గజేంద్రరావు.

"అరగంట— ...."

"రావద్దని చెప్పగలవా?" అన్నాడు గజేంద్రరావు.

"ఎందుకు?" అన్నాడు పాల్సన్ ఆశ్చర్యంగా.

"శరత్ యిక్కడకు వస్తాడని యింకెవరికయినా తెలుసా?"

"తెలియదు!"

"తెలుసు...."

"ఎవరికి?"

"అదే మనం తెలుసుకోవాలి. కానీ ఈలోగా శరత్ యిక్కడకు రాకుండా ఆపాలి!"

"అసలేం జరిగిందో చెప్పండి...."

"శరత్ కొన్ని రహస్యపత్రాలు తెస్తాడు. వాటి కోసం మనంకాక మరో ముఠా కూడా ప్రయత్నిస్తోందని నీకు తెలుసు. వాళ్ళో యిద్దరు మనుషుల్ని పంపారని నా అనుమానం—...."

"మీ అనుమానానికి ఆధారం...."

"ఇక్కడేదో నేరం జరుగుతుందనీ అది ఆపడానికే వచ్చామనీ యిద్దరు మనుషులన్నారు. వాళ్ళు పోలీసుల మనుషుల్లా లేరు. మనకు తెలియకుండా వచ్చే పోలీసు మనుషులెవరూ ఉండరుగదా—వాళ్ళు మన శత్రువుల ముఠావాళ్ళే అయివుండాలి—"

"అంతా మీ అనుమానమేమో!"

"కాదు. వాళ్ళలో ఒకడు చాలా నర్మగర్భంగా

మాట్లాడుతున్నాడు. నా పేరు చెప్పాడు. తన రాక నాకు సంతోషం కలిగించేది కాదన్నట్లు పరోక్షంగా సూచించాడు—"

పాల్సన్ ఆయన చెప్పిందంతా శ్రద్ధగా విని—"మన మిప్పుడు శరత్ ని ఆపలేము. అందుకని వాళ్ళనే ఒక పట్టు పట్టాలి—...." అన్నాడు.

"శరత్ నెందుకాపలేము?"

"అతనెక్కడ బయల్దేరుతున్నదీ మనకు తెలియదు. ఏ వేషంలో వున్నదీ మనకు తెలియదు. హఠాత్తుగా వచ్చి కోడ్ వర్డ్ చెబుతాడు. నేను సిగరెట్ అడుగుతాను. అతడు పెట్టె నాకిస్తాడు. నేనతడికి సిగర్ లైటరిస్తాను. లైటర్లో వజ్రాలుంటాయి. సిగరెట్ పెట్టెలో రహస్య పత్రాల మైక్రో ఫిల్ముంటుంది—...." అన్నాడు పాల్సన్.

"సరే—నువ్వు సిగరెట్ పెట్టె నాకిస్తావు. ఇదంతా నాకు తెలిసిందే—...." అని—"నేనిచ్చిన లైటరు భద్రంగా వుంది కదా—...." అన్నాడు గజేంద్ర రావు.

"ఉందికానీ—కాసేపది మీ దగ్గరే వుంచండి. నే నా యిద్దరి సంగతీ చూసుకుని వస్తాను. ఈలోగా శరత్ వస్తే—అతడికి మీరూ తెలుసుగదా—...." అన్నాడు పాల్సన్.

"ఊఁ" అంటూ గజేంద్రరావు శాస్త్రినీ, శర్మనూ మారాన్నుంచే అతడికి చూపించి—"వాళ్ళనేంచేస్తావు?" అన్నాడు.

"సూదిగుచ్చి చంపేస్తాను—" అన్నాడు పాల్సన్.

"ఇక్కడే—ఈ విందులోనా!"

"లేదు—మాటలతో మభ్యపెట్టి బయటకు తీసుకుని వడతాను—...."

"వాళ్ళు రాకపోతే?"

పాల్సన్ నవ్వి—"నా పద్ధతులు నావి. వాళ్ళను ఫినిష్ చేసి వస్తాను— ...." అన్నాడు.

"రసాభాస జరక్కుండా చూడు— ...." అన్నాడు గజేంద్రరావు.

పాల్సన్ జేబులోంచి ఓ లైటర్ తీసి గజేంద్రరావు కందించాడు.

గజేంద్రరావు జేబులోంచి సిగరెట్ తీశాడు. లైటర్లో వెలిగించుకుని—"థాంక్స్!" అన్నాడు.

6

అది ఒక అందమైన గది.

గదిలో ఒంటరిగా ఉందో అందమైన అమ్మాయి.

ఆమె పేరు శ్రీరమ.

ఆమె ఎంతో అందంగా ఉంది. అంత అందమైన ముఖంలో దిగులుండటం ఎలాంటివారికైనా దిగులు కలిగిస్తుంది.

శ్రీరమ సుబ్రహ్మణ్యేశ్వరరావు కూతురు. పెళ్ళి కూతురు.

ఆమె వంటి నిండా ఖరీదయిన బట్టలు, నగలు ఉన్నాయి

ఆమె మనసులో ఉన్న సుబ్బారావు పేదవాడు, కటిక పేదవాడు.

బియ్యే ప్యాసై ఉద్యోగం లేకుండా తిరుగుతున్నాడు. శ్రీరమ కరుణించి నాలుగు డబ్బులిస్తే తప్ప కాఫీ కూడా దొరకదతడికి.

సుబ్బారావుకు తల్లి తండ్రి, ఇద్దరన్నలు, ముగ్గురక్కలు, ఓ చెల్లి వున్నారు.

శ్రీరమ సుబ్బారావును పెళ్ళి చేసుకుంటే వారందరినీ నాశనం చేస్తానని సుబ్రహ్మణ్యేశ్వరరావు సుబ్బారావు తండ్రిని బెదిరించాడు. శ్రీరమను మర్చిపోకపోతే తిండీ తిప్పలూ వుండదని సుబ్బారావును తల్లీ తండ్రీ బెదిరించారు.

శ్రీరమ కంతా తెలిసింది. సుబ్బారావు తనమీద చేయి పడితే మాటలు దక్కవని ఆమె తండ్రికి చెప్పింది. తను ఆత్మహత్య చేసుకుంటానంది.

వాళ్ళిద్దరి పెళ్ళికీ తన అభ్యంతరం లేదని తండ్రి అన్నాడు.

సుబ్బారావు తన తలిదండ్రుల క్షేమం కోరి శ్రీరమను పెళ్ళి చేసుకోనని చెప్పాడు. తలిదండ్రులపై కోపం కొద్దీ ఇంట్లో తిండి మానేశాడు.

సుబ్రహ్మణ్యేశ్వరరావు శ్రీరమకు తన అంతస్తుకు తగ్గ సంబంధం చూశాడు. ఇప్పుడామెకు పెళ్ళి అయిపోతోంది.

పెళ్ళికి ముందు విందిది.

రాత్రి ఒంటి గంటకు పెళ్ళి ముహూర్తం.

అతిథుల సల్లాపపర్చడానికి సుబ్రహ్మణ్యేశ్వరరావెన్నో ఏర్పాట్లు చేశాడు. ఎన్నో లక్షలు ఖర్చుపెడుతున్నాడు.

ఆయన కూతురు మనసులో మాత్రం ఉల్లాసం లేదు.

కాసేపామె ఒంటరితనాన్ని కోరింది. మనసులోని బరువంతా దింపుకుని తేలిక చేసుకుంటానంది.

కానీ క్రమంగా ఆమె హృదయం మరింత బరువెక్కి

తోంది.

ఆ సమయంలో ఆ గదిలో ఆమె ముందు ప్రత్యక్ష మయ్యాడు సుబ్బారావు.

శ్రీరమ తెల్లబోయి చూసింది.—"నువ్వేనా—ఏమిలా వచ్చావు?"

సుబ్బారావు వికటంగా నవ్వాడు—"నేను నీ కోసం రాలేదు. నీ నగలకోసం వచ్చాను—"

"అంటే?"

"నీకూ నాకూ పెళ్ళి జరిగితే నా కుటుంబం సర్వ నాశనమైపోతుంది. అది నేను భరించలేను. నీకు డబ్బుంది. ఆ డబ్బుతో నువ్వు నన్ను మర్చిపోగలవు. నేనూ నిన్ను మరిచిపోవాలనుకుంటున్నాను. అందుకు డబ్బు కావాలి. నగలు ఒలిచి కింద పెట్టు—...." అన్నాడు సుబ్బారావు.

"నా మనసు మార్చడానికి మా నాన్న నిన్నిలా నాటకమాడమన్నాడా?"

"నువ్వెలాగనుకున్నా నాకు బాధలేదు. మీ నాన్న ఈ ప్రపంచంలో ఎవరినైనా ఆడించగలడు. నన్నాడిస్తే ఆశ్చర్యమేమీలేదు. నాకు నీ నగలు కావాలి—...."

"నగ లెందుకు—క్యాష్ యిస్తాను—పట్టుకు పో—...."

"వద్దు—నగలే కావాలి....నీ నగలే కావాలి. ఆ నగలను ఓ పెట్టెలో పెట్టుకొని నిన్నుగా భావిస్తూ ఆనందిస్తాను...." అన్నాడు సుబ్బారావు.

"నన్నుగా భావించి ఆనందించడానికి నగలెందుకు? నా ఫోటో చాలదూ?" అంది శ్రీరమ.

"చాలదు. నీ ఫోటో విలువైనది కావచ్చు. ఇతరులు దానికి విలువివ్వరు. నేను నిన్నుగా భావించే వస్తువుకు

ఇతరులు కూడా విలువనివ్వాలి, అందుకే నగలడుగు తున్నాను...."

"ఎలావచ్చావీ గదిలోకి!"

"మనసుంటే మార్గముంటుంది. బాత్రూంలో నుంచి వచ్చాను...."

"ఎవరూ నిన్నడ్డగించలేదా?"

"నే నిక్కడకు వస్తున్నట్లు మా నాన్నకూ, మీ నాన్నకూ తెలుసు...."

శ్రీరమ ఆశ్చర్యపడింది.

సుబ్బారావు మళ్ళీ వివరించాడు—"నీకు నామీద ప్రేమ లేదని ఇద్దరూ నన్ను సవాలు చేశారు. నేను నీ నగల నడిగి తెస్తానని సవాలు చేశాను. ఇది మన ప్రేమకు పరీక్ష. ఈ పరీక్ష యెందుకో తెలుసా? నాన్నకు నీ నగలు కావాలి. మీ నాన్న నన్ను దొంగను చేయాలనుకొంటున్నాడు. అయితే ప్రేమ ఈ యిద్దర్నించీ నన్ను రక్షించగలదు. నువ్వేమో నాకు నగలిస్తావు. నాన్న తెల్లబోతాడు. మీ నాన్న నాపై దొంగతనం నేరం మోపితే—అది నువ్వే యిచ్చావంటావు. మీ నాన్నా దెబ్బతింటాడు—"

"నా ప్రేమ నేను ఋజువు చేసుకుంటాను, మరి నీ ప్రేమెలా ఋజువౌతుంది?"

"నువ్విచ్చిన నగలు నేను సొమ్ము చేసుకోను. వాటిని అలాగే ఆరాధిస్తాను. ఆ విధంగా నా ప్రేమ మా నాన్నను దెబ్బతీస్తుంది. దొంగతనం నేరం మోపడు తుందని తెలిసీ నీ నగలు నేను తీసుకుంటాను. అది మీ నాన్నకు నా ప్రేమను తెలియజెప్తుంది— ...."

"శభాష్!" అంది శ్రీరమ — "ఇంతగా నన్ను

ప్రేమించినవాడివి — ధైర్యంగా నన్ను పెళ్ళాడ వచ్చుగా—"

"నా ప్రేమ నా జీవితంతో ఆడుకోవచ్చు. ఇతరుల జీవితాలతో ఆడుకోరాదు...."

శ్రీరమ నగలు ఒలిచి మూటగట్టి—"వీటిలో నా అంతరాత్మ కలిసింది. నేను కట్టెగా మిగిలిపోతున్నాను" అంది.

"థాంక్స్ శ్రీరమా!" అని సుబ్బారావు మూట అందుకొని బాత్రూంవైపు నడిచాడు.

"ఆగు—చక్కని రాజమార్గముందిగా—...." అంది శ్రీరమ.

"నీ యింటికి రాజమార్గాన వచ్చే అవకాశం నాకు లేదు. దొంగలా వచ్చాను. దొంగలాగే వెళ్ళి పోతాను—...." అంటూ సుబ్బారావు బాత్రూంవైపు వెళ్ళాడు.

శ్రీరమ కదలలేదు. అతడు వెడుతున్నవైపే చూసి భారంగా నిట్టూర్చింది. ఇప్పుడేం జరుగుతుంది? అతణ్ని పోలీసులు పట్టుకుంటారా?"

"రేపు సుబ్బారావు యోగక్షేమాలు విచారించాలి" అని ఆమె అనుకొంటూండగా—అక్కడికి సుబ్రహ్మణ్యేశ్వర్రావు వచ్చాడు. ఆయనననుసరించే శ్రీరమ తల్లి కూడా వచ్చింది.

"కాసేపు నన్ను ఒంటరిగా వదలమన్నాను కదా!" అంది శ్రీరమ.

"మీ అమ్మ నిన్నిప్పుడు అసలు నగలతో అలంకరించాలని వచ్చింది—...."

"అంటే?" అంది శ్రీరమ తెల్లబోయి.

"సుబ్బారావు నిన్ను కలుసుకోవాలనుకొన్నాడు. రాజమార్గంలో అతడు కలుసుకోకేందుకు వీలులే దన్నాను. తనపై నీకు గల ప్రేమను బుజావు చేస్తా నన్నాడు. అందుకే నీకు ముందు నకిలీ నగలు తగిలించడం జరిగింది. ఇప్పుడు సుబ్బారావు నీనిచ్చిన నగలు పరీక్ష చేయిస్తే—నీ ప్రేమ నకిలీదని తెలుసుకుని గుండె పగిలి చస్తాడు...."

సుబ్రహ్మణ్యేశ్వరరావు విలన్లా నవ్వుతున్నాడు.

తల్లి శ్రీరమకు నగ అలంకరిస్తోంది.

శ్రీరమ ప్రాణప్పడిపోయింది.

7

"మీ ఆరోగ్యం బాగాలేదు. మీరు నాతో బయటకు రండి—" అన్నాడు పాల్సన్ శాస్త్రి, శర్మల నుద్దేశించి.

"మేము రాము—" అన్నాడు శాస్త్రి అతడివంక ఆశ్చర్యంగా చూస్తూ.

"అదిగో — అటు చూడండి....ఆయన డాక్టరు. ఇక్కడికి వచ్చినవారిలో మీ ప్రవర్తన బాగోలేదనీ— అందుకు అనారోగ్యం కారణమనీ ఆయన చెప్పాడు. మీరు నాతో బయటకు రాకపోతే—మీ రెవరోనని ఆరా తీయాల్సి వస్తుంది...." అన్నాడు పాల్సన్.

"బయటకు వచ్చి యేం చేయాలి....?" అన్నాడు శర్మ.

"ఎక్కడ తెలుసుకునే వివరా లక్కడే తెలుసుకోవాలి...." అన్నాడు పాల్సన్.

శాస్త్రి, శర్మ—యిద్దరూ పాల్సన్తో కలిసి ఆ భవనం ఆవరణ నుంచి బయటపడ్డారు. ఇద్దరూ అతని

ననుసరిస్తూ సందులూ గొందులూ తిరిగి ఓ చిన్న దాబా యింట్లో ప్రవేశించారు.

"కూర్చోండి—" అన్నాడు పాల్సన్.

అక్కడ రెండు కుర్చీలున్నాయి. ఇద్దరూ కూర్చున్నారు.

"మీ రెవరో చెప్పండి!"

"నా పేరు శాస్త్రి, ఇతడి పేరు శర్మ ..."

"ఇంకా... "

"అంతకు మించి వివరాలుంటే బాగుండునని మాకూ వుంది. మా వివరాలంతే...."

"మీ చేత ఎలా చెప్పించాలో నాకు తెలుసు...." అంటూ పాల్సన్ చొక్కా విప్పి ఓసారి ఛాతీ ఉబ్బించాడు.

మరుక్షణంలో అతడు నేలమీద వున్నాడు.

"డియర్ మిస్టర్ ఎక్స్! ఇప్పుడు నీ వివరాలు చెప్పు. ....లేదా చెప్పించాల్సి వుంటుంది...." అన్నాడు శర్మ తీవ్రంగా.

ముందు చెప్పకపోయినా పాల్సన్ గజేంద్రరావు వ్యవహారం గురించి కొంత చెప్పకతప్పలేదు.

శాస్త్రి, శర్మ అతడినక్కడే కుర్చీకి బంధించి మళ్ళీ పార్టీకి వెళ్ళారు. అయితే మామూలుగా కాదు—మారువేషాల్లో.

శాస్త్రి తిన్నగా గజేంద్రరావు వద్దకు వెళ్ళాడు. పాల్సన్ దగ్గర తెలుసుకున్న కోడ్ వర్డ్ చెప్పాడు.

"శరత్!" అన్నాడు గజేంద్రరావు ఉత్సాహంగా.

గజేంద్రరావతడికి లైటరిచ్చి—అతడిచ్చిన సిగరెట్ పెట్టె తీసుకొన్నాడు. అప్పుడు శాస్త్రి నెమ్మదిగా—

"కాసేపట్లో యిక్కడికి మరో శరత్ రావచ్చు—" అన్నాడు.

"అదేమిటి?"

"మన పథకం శత్రువులకు తెలిసింది. వాళ్ళు తెలివిగా మీ దగ్గర వజ్రాలు కాజేయాలనుకొంటున్నారు. ఆ మనిషిని పట్టడానికి మన మిక్కడే పొంచి ఉండాలి—...."

"ఎలా పడతాం?"

"చాలా సింపుల్—మరో శరత్ వచ్చి కోడ్ వర్డ్ చెబుతాడు. వాణ్ని మనం తెలివిగా ట్రాప్ చేసి బయటకు తీసుకుని వెళ్ళాలి...."

సరే నన్నాడు గజేంద్రరావు.

సరిగ్గా పది నిముషాలకు వచ్చాడు నిజం శరత్.

అతడు ముస్లిం వేషంలో వున్నాడు. కోడ్ వర్డు చెప్పగానే గజేంద్రరావు వతణ్ని గుర్తించాడు. శాస్త్రిని పిలిచాడు.

శాస్త్రి చేయిజాపి—"హలో—శరత్!" అన్నాడు.

"నా పేరు శరత్ కాదు—సలీం—" అన్నాడు శరత్.

"అయాం సారీ—నిన్ను పాల్సన్ తీసుకుని రమ్మన్నాడు ..."

"ఎందుకు?"

శాస్త్రి శరత్ చెవిలో—"గజేంద్రరావుని నమ్మడానికి లేదుట. రహస్యపత్రాలు తనకే అందజేయాలన్నాడు. తనిక్కడ లేడు...." అన్నాడు.

"ఎక్కడున్నాడు?" అన్నాడు శరత్.

"నాతో వస్తే చూపిస్తాను—...." అన్నాడు.

శరత్ అనుమానంగా-"నిన్నెలా నమ్మడం" అన్నాడు.

శాస్త్రి జేబులోంచి లైటర్ తీశాడు.

అది చూస్తూనే శరత్ ముఖం వెలిగింది.

ఉత్సాహంగా—'అదే' అన్నాడు.

"పాల్సన్ గుర్తుగా వుంటుందని నాకిది యిచ్చాడు. నువ్వు నాతో రా—పాల్సన్ దగ్గరే యివి తీసుకుందువు గాని—...." అన్నాడు శాస్త్రి.

శరత్ సంతోషంగా అంగీకరించాడు.

శాస్త్రి అక్కణ్ణించి కదులుతూ గజేంద్రరావుకు కన్నుకొట్టాడు. గజేంద్రరావు ఉత్సాహంగా తనూ కన్ను కొట్టాడు.

8

శాస్త్రి, శరత్ కలిసి వెళ్ళడం చూశాడు శర్మ.

"ఈ దెబ్బతో గజేంద్రరావు ఆట కట్టవుతుంది—" అనుకొన్నాడు శర్మ. గజేంద్రరావు కంపెనీ ఉద్యోగిగా వుంటూ—ఎందరో సంఘవిద్రోహులకు సాయపడుతూ—సంఘంలో తన హోదానూ, అంతస్తునూ పెంచుకుంటు న్నాడు. పాల్సన్, శరత్‌లను శాస్త్రి పోలీసుల కప్ప గించాడంటే అందులోంచి చాలా రహస్యాలు బయట పడతాయి.

"ఇప్పుడు నే నేం చేయాలి....?" అనుకొన్నాడు శర్మ.

శాస్త్రి చెప్పినప్రకారం గజేంద్రరావు నో కంట కని పెడుతూ వే రెవరితోనూ చేతులు కలపకుండా చూడాలి.

శర్మ గజేంద్రరావునే గమనించసాగాడు.

మోసపోయానని ఎరుగని గజేంద్రరావు—మోసం

నుంచి తప్పించుకున్నాననుకుంటూ మహా ఉత్సాహంగా తిరుగుతున్నాడు.

అప్పుడు షామియానాలో మేజిక్ ప్రదర్శన ప్రారంభ మయింది.

చాలామంది మెజీషియన్ చుట్టూ చేరారు. అందులో గజేంద్రరావూ వున్నాడు. శర్మకు మాత్రం ఆయన్ని కని పెట్టాలో, మెజీషియన్ను కనిపెట్టాలో తెలియడంలేదు.

మెజీషియన్ చేస్తున్న ట్రిక్స్ చాలా గొప్పగా వున్నాయి. అయినా శర్మ గజేంద్రరావునే కనిపెడు తున్నాడు.

గజేంద్రరావు ట్రిక్స్ చూస్తున్నాడు. ఆయన చాలా హుషారుగా వున్నాడు.

ఉన్నట్లుండి మెజీషియన్ ఆయన్ని పిలిచాడు.

గజేంద్రరావు వెళ్లాడు.

మెజీషియన్ ఆయన్నో అద్దాలతలుపుల పెట్టెలో వుంచాడు. పెట్టెను నాలుగువైపులా తిప్పాడు.

అన్నివైపుల నుంచీ గజేంద్రరావు కనబడుతున్నాడు.

మెజీషియన్ ఆయన్ను పేరడిగాడు.

"గజేంద్రరావు—" అన్నాడాయన.

"అయితే మీరిప్పుడు గజేంద్రమోక్షం చూస్తారు—" అన్నాడు మెజీషియన్. "భగవంతుడే యీయనకోసం ఈ అద్దాలపెట్టెని పంపించాడు...." అంటూ అద్దాలపెట్టెకి నాలుగువైపులా తెరలు దించాడు. మరోసారి అద్దాల పెట్టెని నాలుగువైపులా తిప్పాడు.

అప్పుడు తెరలు తొలగించాడు.

పెట్టె ఖాళీగా వుంది.

అంతా చప్పట్లు కొట్టారు.

కానీ గజేంద్రరావు వెనక్కి రాలేదు.

మెజీషియన్ మరో ట్రిక్కు చేస్తున్నాడు.

శర్మ హుటాహుటిన నడిచి మెజీషియన్ దగ్గరకు వెళ్ళి—"గజేంద్రరావుగారేమయ్యారు?" అన్నాడు.

"ఎందుకు?" అన్నాడు మెజీషియన్.

"నా కాయనతో పనుంది—...."

"మోక్ష ప్రాప్తి కలిగినవారు మనకిక కనపడరు—" అన్నాడు మెజీషియన్.

అంతా నవ్వారు.

"నాకూ మోక్ష ప్రాప్తిని కలిగించు—" అన్నాడు శర్మ.

"అందు కీశ్వరుడి పిలుపు రావాలి—" అన్నాడు మెజీషియన్.

మళ్ళీ అంతా నవ్వారు.

శర్మ లాభంలేదని వెనక్కి వచ్చేశాడు.

మెజీషియన్ చాలా చురుకయినవాడు. అతడు చాలా తెలివిగా మాట్లాడుతున్నాడు, చురుకుదనం మాటల్లోనూ, చేతల్లోనూ, చేతుల్లోనూ కూడా వుంది.

శర్మ ఆలోచిస్తున్నాడు.

సాధారణంగా మెజీషియన్లు తాము మాయం చేసిన వ్యక్తిని తిరిగి రప్పిస్తారు. గజేంద్రరావు విషయంలో అలా జరుగలేదు.

కావాలనే తెలివిగా ఆయన్ను మాయం చేయడం జరిగిందా?

పెద్దవాళ్లో పిలుపందినప్పుడు— అక్కడ కలుసుకుందుకు వచ్చేవారందరూ తమ కార్యకలాపాలు కొనసాగించుకోవాలని వస్తున్నారు.

గజేంద్రరావు పెద్ద వ్యవహారాల్లో వున్నాడు.

ఇప్పుడు తను సంపాదించిన రహస్య పత్రాల నాయనేం చేయాలనుకుంటున్నాడు? ఏ దేశాని కమ్మాలనుకుంటున్నాడు?

ఇవన్నీ కని పెట్టాలనుకున్నాడు తను.

ఆయన మాయమయ్యాడు.

త నాయన్ను కని పెడుతున్న సైతరి కయినా తెలిసిందా?

అప్పుడే శర్మ భుజంమీద ఎవరిదో చేయి పడింది.

అతడు వెనక్కి తిరిగాడు.

లావుగా, పొట్టిగా వున్నా డతడు. శర్మ భుజంమీద చేయి వేయడంకోసం కాబోలు—అతడో చిన్న స్టూలు మీద నిలబడి వున్నాడు.

శర్మ అతడివంక ప్రశ్నార్థకంగా చూశాడు.

"గజేంద్రరావును చూస్తావా?"

"ఊఁ."

"నాతో రా—"

శర్మ అతడి ననుసరించాడు.

అతడు శర్మను సరాసరి సుబ్రహ్మణ్యేశ్వరరా వింటిలోనికి తీసుకుని వెళ్ళాడు.

శర్మ ఆశ్చర్యపడ్డాడు. అతడి కిల్లంతా తెలిసినట్లే కన పడుతోంది.

ఇద్దరూ మేడమీద ఓ గదిలోనికి వెళ్ళారు.

గదిలో రెండు కుర్చీలున్నాయి.

ఇద్దరూ చెరో కుర్చీలో కూర్చున్నారు.

"ఎవర్నువ్వు?" అన్నాడు పొట్టి వ్యక్తి.

"ఇంటెలిజెన్సు మనిషిని— ...."

"వాళ్ళంతా నాకు తెలుసు. నువ్వు వాళ్ళలో మనిషివి కాదు—...."

శర్మ నవ్వి—"లోకంలోని తెలివైనవాళ్ళందరూ నీకు తెలిసినట్లు మాట్లాడుతున్నావే—....ఇంటెలిజెన్సంటే నా ఉద్దేశ్యం—తెలివున్న మనిషి ...." అన్నాడు.

"అదే నిజమైతే—తెలివికి ఫుల్‌స్టాప్ పెట్టడం నాకు చేతనవును—...."

"ఎలా?"

"ఈ పెన్‌తో—...." అంటూ జేబులోంచి అతడొక పెన్ తీశాడు,

శర్మ అతడి చేతిలోని పెన్‌వంక చూశాడు. మాడ్డానికది మామూలు పెన్నులాగే వుంది—"పెన్ను తెలివికి ఫుల్‌స్టాపెలా పడుతుంది?"

"మీట నొక్కితే సయనైడ్ పిన్ ఒకటి నీ గుండెల్లోకి దిగుతుంది. వెంటనే నీ ప్రాణాలు పోతాయి. తెలివికి ఫుల్‌స్టాప్ పడుతుంది—...."

"ఎవరు నువ్వు?" అన్నాడు శర్మ,

"గజేంద్రరావును కలుసుకోవాలంటే నీకూ మోక్షం కావాలి. అది నీకిప్పించాలనే వచ్చాను...." అన్నాడు పొట్టి వ్యక్తి.

"గజేంద్రరావును కలుసుకోవాలంటే తప్పా?"

"ఊఁ."

"ఎందుకు?"

"మొసలి ఒకటి అతడి కాళ్ళను పట్టుకుంది. అతడిని విడిపించాలనుకున్న వాళ్ళనా మొసలి పట్టుకుంటుంది...."

"ఎవరా మొసలి?"

"నేనే!" అన్నాడతడు—"మొసలికి నీటిలో బల

ముంటుంది. విష్ణుచక్రంమించి దానినెవరూ యేమీ చేయ లేరు. నేను మొసలినైతే ఈ ప్రపంచమంతా నాకు జల మయమే!"

"నాకు సరిగ్గా చెప్పు...."

"గజేంద్రరావు పెద్ద కంపెనీలో మేనేజరు. సమా జంలో అతడికి గొప్ప హోదా వుంది. పలుకుబడి వుంది. అతడినో పెద్ద పట్టు పట్టాను నేను. అతడిద్వారా యెన్నో పనులు సాధిస్తున్నాను. అతడికిది ఇష్టంలేదు. తప్పించు కుందామని చూస్తున్నాడు. అతడిని నేను వెయ్యి కళ్ళతో కనిపెడుతున్నాను...." అన్నా డా పొట్టి వ్యక్తి.

"అయితే?"

"గజేంద్రరావుకీ రోజు చాలా ముఖ్యమైన రహస్య పత్రాలందాయి. వాటిని మేము విదేశాలకమ్మబోతున్నాం. గజేంద్రరావు కిది ఇష్టంలేదు. ఆ రహస్య పత్రాలను మా కందకుండా చేస్తాడని నా నమ్మకం .. అందుకే గజేంద్ర రావుని వెయ్యి కళ్ళతో కనిపెడుతున్నాను. అయితే అతడు తన్ను తాను రక్షించుకునేందుకు నిన్ను నియమిం చాడని నా నమ్మకం."

శర్మ నవ్వి—"ఏడిపినట్లుంది—" అన్నాడు.

"నువ్వాతణ్ని వెయ్యికళ్ళతో కనిపెడుతున్నావు. మ్యాజిక్ షో చూడ్డంకూడా మానేసి అతణ్ని కనిపెడు తున్నావంటే—అతదే నిన్ను నియమించుకుని వుండాలి. తన దగ్గరున్న రహస్యపత్రాలనతడు మాకిచ్చే ఉద్దేశ్యంలో లేదు. వాటి రక్షణకోసమే అతడు నిన్ను తన్ను కని పెట్టనున్నాడు. అందుకే నేనతణ్ని మెజీషియన్ ద్వారా మాయంచేసి నా దగ్గరకు రప్పించుకున్నాను. మెజీషి యన్ కూడా మా మనిషి. నువ్వతణ్ని గజేంద్రరావు

గురించి అడగడంలో నీమీద నాకున్న అనుమానం రూఢి అయింది. అందుకే నిన్నూ ఓ పట్టుపట్టాలనుకున్నాను...."

"పట్టయితే చేతో పట్టాలి...." అన్నాడు శర్మ.

"ఆ సరదా కూడా తీరుస్తాను. కానీ ముందు నాకీ విషయం చెప్పు. ఆ రహస్యపత్రాల మైక్రో ఫిల్ము ఏం చేశావో చెప్పు...."

"అది గజేంద్రరావు దగ్గరుండాలి. గజేంద్రరావు మీ దగ్గరున్నాడు...."

"గజేంద్రరావు మా దగ్గరే వున్నాడు. మైక్రోఫిల్ము అతడి దగ్గర లేదు. అతను తానేమీ ఎరుగనంటున్నాడు...." అన్నాడు పొట్టి వ్యక్తి.

"నాకూ ఏమీ తెలియదు...."

"తెలియకపోతే చెప్పిస్తాను...." అంటూ పొట్టి వ్యక్తి లేచి నిలబడ్డాడు.

శర్మ అతడివంకే చూస్తున్నాడు.

పొట్టి వ్యక్తి వెనక్కు అడుగులు వేసుకుంటూ గుమ్మం దాకా వెళ్ళి—"ఈ గది తలుపులు నేను తెరిస్తే తప్ప తెరుచుకోవు. ఇక్కడే ఉండి ఆలోచించుకో—ఓ గంట టైమిస్తున్నాను. మళ్ళీ వచ్చేసరికి మైక్రోఫిల్ము గురించిన సమాచారం నాక్కావాలి..." అన్నాడు.

"నే నివ్వకపోతే?"

"తిండీ నీళ్ళూ లేకుండా ఈ గదిలోనే అంతమవుతావు—...." అంటూ పొట్టి వ్యక్తి గుమ్మం బయటకు వెళ్ళి తలుపులు వేశాడు.

9

శర్మ గదంతా కలయదిరిగాడు. గోడలు మినహాయించి వేరే ఏమీ లేవు—తలుపులు గానీ—గుమ్మాలు గానీ! వున్న

ఒక్క గుమ్మం తలుపులూ మూసి వున్నాయి.

ఆ తలుపులు తెరవాలని శాయశక్తులా ప్రయత్నించా డతడు. లాభం లేకపోయింది.

మరో గంటదాకా ఆ నాగదిలో బందీగా పడివుండక తప్పదు.

శర్మ కుర్చీలో కూర్చుని ఏం జరిగిందో మననం చేసు కున్నాడు.

కేవలం ఆకలితీర్చుకోవడంకోసం-ఈ పార్టీ కొచ్చారు. అక్కడ గజేంద్రరావు తగిలాడు. ఆయన తమను పరో క్షంగా పరిహాసించాడు. ఆయన్ను భయపెట్టాలని తమ గురించి అబద్ధం చెప్పాడు. పాల్సన్ వచ్చాడు. ఓ పెద్ద వ్యవహారం బయటపడింది. శాస్త్రి పాల్సన్నీ, శరత్ నీ పోలీసుల కప్పగించాలని వెళ్ళాడు ఈలోగా పాట్టి వ్యక్తి తననను మానించి ఈ గదిలో బంధించాడు. అతడు తలుపులు తీస్తే తప్ప తానిక్కడినించి బయటపడలేడు.

ఒకవేళ శాస్త్రి మైక్రోఫిల్ముల్ని పోలీసులకందజేయ గానే—పోలీసులు రంగంలోకి దిగితే—పాట్టి వ్యక్తికి మైక్రోఫిల్ములు పోలీసుల పాలయ్యాయని తెలిసిపోతే. అప్పుడిక అతడు తన నీ గదిలోంచి బయటకు రప్పించడు.

అతడు తన నిక్కడ బంధించిన విషయం యెవరికీ తెలియదు.

ఇది సుబ్రహ్మణ్యేశ్వరరావిల్లు. అంటే ఈ వ్యవహారా లన్నింటిలోనూ ఆయన హస్తముంది.

ఈ గదిలోంచి బయటపడడమెలా?

శర్మ గదినంతా క్షుణ్ణంగా పరిశీలిస్తున్నాడు.

గోడలు తెల్లగా వున్నాయి. ఎక్కడా చిన్న మచ్చ

కూడా లేదు.

నేలమీద కార్పెట్ లేదు కానీ — మొజాయిక్ ఫ్లోరింగ్.

శర్మ ఫ్లోరింగ్ నే తీక్ష్ణంగా పరిశీలించసాగాడు.

అక్కడేమీ కనపడడంలేదు.

చివరికి శర్మ విసిగిపోయి మళ్ళీ కుర్చీలో కూర్చున్నాడు. అతడి శరీరం తిన్నగా వుండడంలేదు. అసహనంతో వూగుతోంది.

అప్పుడు శర్మ ఓ విచిత్రం గమనించాడు.

మామూలు పేము కుర్చీలవి. తానెంత కదిలినా కుర్చీ కదలడంలేదు. అంటే వాటిని నేలలోకి తాపడం చేసి వుండాలి. ఎందుకు? శర్మ కుర్చీలోంచి లేచాడు. కుర్చీని కదపాలని చూశాడు.

కుర్చీ కదలడంలేదు.

శర్మ తన బలాన్నంతా ఉపయోగించి కుర్చీని కదిపాడు. మొత్తంమీద కుర్చీ కదిలింది. కుర్చీ కదుల్తూంటే యేదో చప్పుడయింది.

శర్మ చప్పుడయినవైపుగా తిరిగాడు.

ఆ పక్కగా గోడలో మనిషి పట్టేటంత మార్గమేర్పడింది.

"హాశ్రే—" అనుకున్నాడు శర్మ.

ఒక్కక్షణంలో అతడా మార్గంలోంచి బయటపడ్డాడు.

అదింకో గది....

ఆ గదిలో....

శర్మ ఉలిక్కిపడ్డాడు.

సీలింగ్ నుంచి పాలిన్ వ్రేలాడుతోంది. ఫ్యాన్ కో

చీర ప్రేలాడుతోంది. చీరతో యువతి ప్రేలాడుతోంది.

ఆమె గిలగిల తన్నుకుంటోంది.

ఎవరో ఆమెను ఫ్యాన్‌కు ఉరితీశారు.

శర్మ ఆలస్యం చేయలేదు.

గదిలోని బల్లను జరిపి — దానిమీద ఓ కుర్చీవేసి— దానిమీదకూ తాను వెళ్ళి — ఫ్యాన్‌కు కట్టిన చీరను విప్పాడు.

ఆమె దబ్బున నేలమీద పడింది.

శర్మ ఆమె గొంతు ముడిని విప్పాడు.

మనిషి నవవధువులా అలంకరించుకుని వుంది.

ఏ దుర్మార్గుడామెను ఉరితీశాడో?

శర్మ ఆమె నాడి పరీక్షించాడు.

ఇంకా ప్రాణం పోలేదు.

కాసేపటిదాకా మెకు పచారాలు చేశాడు.

ఆమెకు స్పృహ వచ్చింది. ఎదురుగా శర్మను చూసి- "ఎవర్నువ్వు?" అంది.

అతడు క్లుప్తంగా తన గురించి చెప్పాడు.

"నా పేరు శ్రీరమ. నేను సుబ్రహ్మణ్యేశ్వరరావుగారి కూతుర్ని. నన్ను నాకంటే గొప్పగా యెవరూ రక్షించలేరు...." అందామె.

"కానీ నేను రక్షించాను...."

"రక్షించి పొరపాటు చేశావు. నా ఆత్మహత్యా ప్రయత్నాన్ని వ్యర్థం చేశావు—"

"ఆత్మహత్యా?" అతడాశ్చర్యపడ్డాడు.

శ్రీరమ క్లుప్తంగా తన కథ చెప్పి—"ఎలాగో అలా అన్నింటికీ సరిపెట్టుకుందామనుకున్నాను. కానీ నా తండ్రి నన్ను నకిలీ నగలతో మోసగించాడు. ఆ మోసాన్ని

సుబ్బారావు నమ్మాడు. అతడి కా విషయం తెలియజెప్పే అవకాశం నాకు లేదు....ఇష్టంలేని పెళ్ళి—తండ్రి చేసిన మోసం—ప్రియుడు నన్ను వంచకిననుకోవడం ఎమోషనల్ గా—నన్ను బలహీనురాలిని చేసింది. ఆత్మహత్యకు పాల్పడ్డాను. నువ్వు రక్షించావని నాకానందంగా లేదు."

"నీకూ సుబ్బారావుకూ పెళ్ళి జరిపిస్తాను. అప్పుడా నందంగా వుంటావా?"

"మా పెళ్ళికి సుబ్బారావే ఒప్పుకోడు...." అంది శ్రీరమ.

"సుబ్బారావొప్పుకున్నా — నువ్వు శ్రీరమ పెళ్ళి జరిపించలేవు...." అన్న గొంతు వెనుకనుంచి వినపడింది.

శర్మ వెనక్కు తిరిగాడు.

అక్కడ పొట్టి వ్యక్తి నిలబడి వున్నాడు.

అతడి చేతిలో పెన్ను మెరుస్తోంది.

శర్మ ఆలస్యం చేయలేదు. అతడు చటుక్కున శ్రీరమ వెనక్కు వెళ్ళి—"ఈమె నాకు రక్షాకవచం—నువ్వు నన్నిప్పుడేమీ చేయలేవు...." అన్నాడు.

"పిచ్చి పిచ్చి వేషాలు వేయకు...." అన్నాడు పొట్టి వ్యక్తి—"నీ రక్షణాకవచం నేలకూలడానికెంతో సేపు పట్టదు...."

"అంటే?"

"నా మైక్రో ఫిల్ములకంటే శ్రీరమ ఎక్కువకాదు నాకు...." అతడింకా యేదో అనబోతుండగా—అతడి చేతిలోని పెన్ను జారి కిందపడింది.

శర్మ వెనక్కు తిరిగాడు.

పోలీసులు!

శాస్త్రి, శర్మ బీచి దగ్గర కూర్చున్నారు.

"మీ ఊరిలో యేదో విశేషముందా శాస్త్రీ! విందుకు వెళ్ళిన పనేమిటి? చేసిన పనేమిటి?" అన్నాడు.

"ఆ మైక్రోఫిల్ములో — దేశ క్షేమానికి హానికలిగించే విశేషాలున్నాయట. అవి విదేశాలు చేరిందంటే — ఎంత ప్రమాదమో మాటల్లో చెప్పడం కష్టం .... ముఖ్యంగా పాకిస్తాన్, బంగ్లాదేశ్, శ్రీలంక — మూక ఉమ్మడిగా మనపై దండెత్తి వుండేవారు. వారికి ఆన్ని దేశాల మద్దతూ వుండేది...." అన్నాడు శాస్త్రి.

"తల్లి భారతమాతకు మనవల్ల సాయం అందవలసి వుంది. మనం నిమిత్తమాత్రులం...." అన్నాడు శర్మ.

"ఈ నేరంలో సుబ్రహ్మణ్యేశ్వరరావు కాబోయే అల్లుడి వేలుందని తెలియడంతో — జరగబోయే పెళ్ళి ఆగిపోయింది. సుబ్రహ్మణ్యేశ్వరరావు ఈ విషయంలో యెంతగా అప్సెట్ అయ్యాడంటే — సుబ్బారావుతో పెళ్ళి జరిపించడానికి ఒప్పుకున్నాడు...."

"ఒప్పుకోక ఏం చేస్తాడు? ఇద్దరూ తమ ప్రేమను గొప్పగా ఋజువు చేసుకున్నారు. సుబ్బారావు నకిలీ నగలతో పోలీస్టేషన్కు వెళ్ళి — మున్ముందు నన్ను అనుమానించవద్దు. నా ప్రియురాలు తన జ్ఞాపకార్థం నాకివి ఇచ్చింది. ఆమె జ్ఞాపకార్థం నేనివి వుంచుకుంటున్నాను — కావాలంటే అడిగి తెలుసుకోండి — అని సూటిగా ధైర్యంగా చెప్పాడు. ప్రియుడిని మోసం చేయలేనని తలచి శ్రీరమ తన జీవితాన్ని అంతం చేసుకోబోయింది — ఇంతకుమించి ప్రేమకేం సాక్ష్యం కావాలి...."

"అవును....అన్నట్లు ఈ ప్రేమికుల పెళ్ళిలో కూడా మహా హాస్య వుంది...."

"అందుకే గా—మనకు సుబ్రహ్మణ్యేశ్వర్రావు పాతిక వేల రూపాయలకు చెక్కిచ్చాడు....తన కూతురి ప్రాణాలు నిలబెట్టినందుకు గాయానిచ్చినది నిజానికి చాలా చిన్న మొత్తం అయితే యాచకుడి పాయిబిచ్చే దాని ఇచ్చే దీ వుంటుంది. తిండికి లేక చస్తున్న సమయంలో—పాతిక వేలంటే మాటలు కాదు మనకి..." అన్నాడు శర్మ.

"సుబ్రహ్మణ్యేశ్వర్రావు విలుకా ట్టింగ్ కూతురి ప్రాణాలకే కాదు.... నవ్వ పోట్టి వ్యక్తి చేత అయాని ట్లో నే బంధి నబడ్డ నిప మా చెప్పకుండా ఉన్నంగకు....ఈ వ్యవహారం లో ఆ కూనూ సంబంధము దనడంలో సందేహం లేదు. కొంత పోలీసులకు డబ్బిచ్చి—కొంత మనకంటి వాళ్ళ నోరు మూయి చి—రప్పించుకుంటున్నాడు...."

"అంటే దేశద్రోహంలో నే ఉన్నాడంటావా? అలాంటప్పుడు మనం ఉ న్కి చకూడదు...."

"డియర్ ఫ్రెండ్....దేశంలో నాలుగు డబ్బులు కూడబెట్టిన ప్రతివాడూ దేశద్రోహి కిందే లెక్క....ఎందుకంటే దేశంలో నూటికి తొంభై మందికి తిండికి కూడా గతిలేదు...."

"అయితే పాతిక వేలు చుకున్న మనమూ దేశద్రోహులమే అవుతాము ఈ డబ్బుతో ఆకలిగా వున్న వాళ్ళందరికీ అన్నదానాలు చేద్దామా?"

"అలా ఎన్నాళ్ళు చేయగలం? ఆ బాధ్యత మనది కాదు. దేశ నాయకులు, ధర్మదాతలు, మత ప్రవక్తలు—ఎదరో వాళ్ళని మానసి కన్నీళ్లు కార్చి—తమ ప్రతులు మామూలుగా సాగదీస్తున్నారు. మనమూ అంతే చేద్దాం.

మళ్ళోసారి ఆకలిబాధ—కనీసం మనకుండకూడదు...."

శర్మ యేదో అనబోతుండగా పరుగున ఓ వ్యక్తివచ్చి వారి ముందాగాడు.

ఆయన గజేంద్రరావు.

"మీ కారణంగా నాకు మోక్షం లభించాలి. మీ సాక్ష్యమే నా నిర్దోషిత్వాన్ని ఋజువుచేస్తుంది—" అన్నాడు గజేంద్రరావు.

"మీరు నిర్దోషులా?" అన్నారు శాస్త్రి, శర్మ ఏక కంఠంతో.

"అవును—నా భార్య, చెల్లెలు, కుమార్తె—వీరి నగ్న చిత్రాలు పబ్లిక్ చేస్తానని బెదిరించి నాచేత అవినీతి కరమైన పనులు చేయిస్తోందొక ముఠా. సమయం చూసి ఆ ముఠాని బయట పెట్టాలని చూస్తున్నాను. నా సెక్రటరీ విశ్వం నాకు కబురు పంపాడు—ఎవరో ఇంటెలిజెన్సు వాళ్ళు—నా ఇన్విటేషన్ కార్డు తన దగ్గర్నుంచి తీసుకున్నారని. ఆయన సమాచారంతో నేను మిమ్మల్ని గుర్తించి—మీరు నిజంగా ఇంటెలిజెన్సు అయితే మీ సహకారం తీసుకోవాలనుకున్నాను. నా సహకారంతో నే మీకు మైక్రోఫిల్ములు వచ్చాయి...."

"ఇలాంటివి నమ్మడానికి మేము చిన్నపిల్లలం కాదు" - అన్నాడు శాస్త్రి.

"ఒక ఋజువుంది. పాల్సన్ తెలివితక్కువవాడు కాదు. తన్ను బంధించినపుడు—అతడు మీకు చెప్పిన కోడ్ వాక్యం తప్పు. ఆ విధంగా నేను మిమ్మల్ని గుర్తించగలనని అతడి ఆశ. కానీ నే నా అవకాశాన్నుపయోగించుకొని—మిమ్మల్ని నమ్మినట్లు నటించాను. మీరు చెప్పిన కోడ్ వర్డు యేమిటో నాకు తప్ప ఎవరికీ తెలియదు

కదా! అందుకని మరా వ్యక్తులకు నామీద అనుమానం రాదు...."

శాస్త్రి, శర్మ—ఇద్దరూ తెల్లబోయారు.

పాల్సన్ నించి కోడ్ వర్డు తెలుసుకున్నారు తాము. గజేంద్రరావు సహకరించాకపోతే తాము — విరోధి వ్యూహ్యంలో అతి సులభంగా చిక్కుకో నేవారు.

"మీరు కోరిన సాక్ష్యమిస్తాం, మీకు మోక్షం కలిగిస్తాం...." అన్నాడు శాస్త్రి.

శాస్త్రి, శర్మల సాక్ష్యాధారంతో—బెయిలుమీద విడుదలైన గజేంద్రరావు—ఆ తర్వాత శాశ్వతంగానే సేసుల బారినుండి బయటపడ్డాడు. అయితే సంవత్సర కాలం జెయిలు శిక్షమాత్రం ఆయనకు తప్పనిసరయింది.

జైల్లో వున్నప్పటికీ—తనకు అప్పుడే మోక్ష ప్రాప్తి కలిగినట్లే ఫీలవుతున్నాడు గజేంద్రరావు.

—: అయిపోయింది :—